నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# నల్లగొండ

శనివారం 9 డిసెంబర్ 2023
SATURDAY, DECEMBER 9, 2023
NALGONDA
పేజీలు : 8
PAGES





# ఎంజీయూలో అదనపు హాస్టళ్లు

## మరింత మందికి వసతి కల్పించేలా నిర్మాణం

- ఇప్పటికే రూ.20 కోట్లు మంజూరు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- గిరిజన శాఖ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళిక
- యూనివర్సిటీని సందర్శించనున్న ఉన్నతాధికారులు.. త్వరలో పనులు ప్రారంభం
- ప్రస్తుతం 1,050 మంది గర్ల్స్, బాయ్స్‌కు హాస్టల్ వసతి
- భవిష్యత్‌లో రెసిడెన్షియల్ వర్సిటీగా తీర్చిదిద్దేందుకు అడుగులు

మధ్య పేజీల్లో..

నల్లగొండలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు హాస్టల్ వసతి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వివిధ కోర్సులు చదివే 1,050 మంది గర్ల్స్, బాయ్స్‌కు వేర్వేరుగా హాస్టళ్లు ఉన్నాయి. భవిష్యత్‌లో రెసిడెన్షియల్ యూనివర్సిటీగా తీర్చిదిద్దే లక్ష్యంగా కొత్త హాస్టళ్లను నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ సర్కారు మరో 250 మందికి వసతి కల్పించేలా రెండు హాస్టళ్ల నిర్మాణానికి రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు స్థలాన్ని పరిశీలించి నిర్మాణాలు చేపట్టడానికి ఉన్నతాధికారులు త్వరలో యూనివర్సిటీకి రానున్నారు. గిరిజన శాఖ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు.

– రామగిరి, డిసెంబర్ 8




3లో..

# మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

## నేటి మధ్యాహ్నం నుంచి అమలు

- పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనే అనుమతి
- ఉమ్మడి జిల్లాలో రోజుకు 70 వేల మంది మహిళల ప్రయాణం
- రూ.50 లక్షల వరకు ప్రభుత్వంపై భారం

మహిళలు ఇక ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. కర్ణాటక తరహాలో రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి అమలు చేయనున్నది. వయసుతో సంబంధం లేకుండా బాలికలు, మహిళలు, ట్రాన్స్‌జెండర్స్‌కు అవకాశం కల్పించింది. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడికైనా వెళ్లొచ్చు. ఏదైనా గుర్తింపు కార్డు చూపించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 7 డిపోల పరిధిలో పల్లె వెలుగు 377, ఎక్స్‌ప్రెస్ 144 బస్సులు నడుస్తున్నాయి. రోజూ సుమారు 70 వేల మంది మహిళలు ప్రయాణిస్తున్నారు. దాంతో ప్రభుత్వంపై రోజుకు రూ.50 లక్షల భారం పడనున్నది.

– నల్లగొండ సిటీ, డిసెంబర్ 8

నసీరుద్దీన్ బాబా దర్గా వద్ద భక్త జనం



# ఘనంగా గంధోత్సవం

అర్వపల్లిలోని హజ్రత్ సయ్యద్ ఖాజా నసీరుద్దీన్ బాబా ఉర్సు ప్రారంభమైంది. రెండు రోజుల ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం గంధోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్వపల్లి పోలీస్ స్టేషన్ నుంచి దర్గా వరకు గంధం ఊరేగింపు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పకీర్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

– అర్వపల్లి, డిసెంబర్ 8

8లో..

# 2,61,105 ఎకరాల్లో పంటల సాగు

## యాదాద్రి జిల్లాలో యాసంగి సాగుకు ప్రణాళిక ఖరారు

- గతేడాదితో పోలిస్తే ఈ సారి 50 వేల ఎకరాల్లో తగ్గిన పంటల అంచనా
- నీటి కొరత, వర్షపాతం లోటుతోనే తగ్గుదల
- అత్యధికంగా 2,40,500 ఎకరాల్లో వరి
- ఎరువులు, విత్తనాలు సిద్ధం చేసేందుకు ప్లాన్
- నకిలీ విత్తనాలపై అధికారుల ఫోకస్

5లో..



రాజాపేట మండలం బేగంపేటలో పొలం దున్నుతున్న రైతు

యాసంగిలో పంటల సాగుకు ప్రణాళిక ఖరారైంది. ఈ సీజన్‌లో కావాల్సిన ఏర్పాట్లను వ్యవసాయ శాఖ సిద్ధం చేస్తున్నది. జిల్లాలో ఈ సారి 2,61,105 ఎకరాల్లో పంటల సాగుకు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. గతేడాది కంటే ఈసారి సుమారు 49వేల ఎకరాల్లో సాగు తగ్గుతుందని పేర్కొన్నది. ఈ సారి వర్షాలు తక్కువగా ఉండటం, నీటి కొరతతో సాగు అంచనా తగ్గినట్లు తెలుస్తున్నది. ఇక జిల్లాలో అత్యధికంగా 2,40,500 ఎకరాల్లో వరి వేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మరోవైపు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. నకిలీ విత్తనాలు అమ్మకుండా పటిష్ట నిఘా పెట్టేందుకు చర్యలు తీసుకోనున్నారు.

– యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ)